

వణికిస్తున్న జ్వరాలు
జిల్లాలో సీజనల్ జ్వరాలు వణికిస్తున్నాయి. నానాటికీ జ్వరపీడితులు పెరుగుతున్నారు. జ్వరాలతో బాధపడుతూ వైద్యశాలలకు వచ్చే వారి సంఖ్య ఎక్కువవుతోంది.
- 8లో..



కోలాహలం.. యువజనోత్సవం
జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్విస్ కాలేజీలో నిర్వహించిన జిల్లా యువజనోత్సవాలు కోలాహలంగా సాగాయి.
- 8లో..

గరిష్టం/కనిష్టం
37/27

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

రేపు బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

ఒంగోలు: బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక ఈనెల 22న గుడ్లూరు మండలం చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సోమినేని సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందన్నారు. ఈ ఎంపికలో పాల్గొనేందుకు 2005 జనవరి 2వ తేదీ తరువాత జన్మించిన వారు మాత్రమే అర్హులు. ఆసక్తిగల క్రీడాకారులు సంబంధిత ధ్రువపత్రంతో ఎంపికకు హాజరుకావాలని, ఎంపికైన వారు అక్టోబరు 5, 6, 7 తేదీల్లో విశాఖపట్నం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వివరాలకు ఫోన్: 9000391008 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

26న ఎస్‌జీఎఫ్ అండర్ 14, 17 క్రీడాజట్ల ఎంపిక

ఒంగోలు: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న వివిధ క్రీడా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ జిల్లా జట్ల ఎంపిక మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో, రోప్ స్కిప్పింగ్, పెంటథ్లాన్, మల్కాలం క్రీడాజట్ల ఎంపిక సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని పీఈటీ/పీడీలు ఆసక్తి కలిగిన విద్యార్థులతో ఆన్‌లైన్ ఎంట్రీ ఫాంతో వచ్చి ఎంపికలో పాల్గొనాలన్నారు. 17 సంవత్సరాల కేటగిరీలో పాల్గొనే ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబర్, సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణతో నిర్వాహకులకు సమర్పించాలన్నారు. వివరాలకు 9666067764 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మెరైన్ సీఐగా సాంబశివరావు



కొత్తపట్నం: కొత్తపట్నం మెరైన్ సీఐగా ఎస్.సాంబశివరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వినుకొండ వీఆర్‌లో ఉన్న ఆయన సాధారణ బదిలీపై కొత్తపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఎస్సై పి.సుబ్బారావు సీఐకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ సముద్రంలో చొరబాటుదారులు రాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తానన్నారు. బీచ్‌కు వచ్చే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సిబ్బందిని పెడతానన్నారు. మెరైన్ పోలీస్ స్టేషన్ పరిశీలించి, మొక్కలు నాటి సిబ్బందిని అభినందించారు.

సుప్రీం కోర్టు తీర్పును పునఃపరిశీలించాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మల్లెల వెంకట్రావు

సింగరాయకొండ: ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ, క్రిమిలేయర్ తీర్పును పునఃపరిశీలించి రద్దు చేయాలని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 22వ తేదీ ఒంగోలులోని అంబేడ్కర్ ఓపెన్ ఆడిటోరియంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్ తీర్పును సుప్రీంకోర్టు పునఃసమీక్షించాలని కోరుతూ జరిగే బహిరంగసభ కరపత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులతో కలిసి ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. మొదటగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు పులగర కృష్ణయ్య, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు, రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శి శ్యామ్ ప్రసాద్, ఉజ్వల పాల్గొన్నారు.

నిందలతో సరి.. నిధుల్లేవు మరి!

- మొక్కుబడిగా సీఎం చంద్రబాబు జిల్లా పర్యటన
- అధికారంలోకి వచ్చాక తొలిసారిగా జిల్లాకు..
- సీఎం సుదీర్ఘ ప్రసంగంలో ప్రతిపక్షంపై విమర్శలకే అధిక సమయం
- జిల్లాలో అభివృద్ధి పనుల ప్రస్తావన లేకపోవడంపై జనం నిట్టూర్పు
- వంద రోజుల్లో ఏమి చేశారో.. ఇకపై ఏమి చేస్తారో చెప్పని వైనం
- ఇదేలా మంచి ప్రభుత్వం అవుతుందంటూ పెదవి విరుస్తున్న ప్రజలు



సాక్షి ప్రతినిధి ఒంగోలు/చీమకుర్తి: "సింగడు అద్దంకి పోనూపోయాడు.. రానూ వచ్చాడు" అన్న తీరుగా సాగింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన. అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబు తన ప్రసంగంలో ఎక్కడా జిల్లా అభివృద్ధికి నిధుల మంజూరుపై నోరు విప్పలేదు. ఎన్నికల సమయంలో జిల్లా వాసులకు పెద్ద ఎత్తున హామీలిచ్చిన చంద్రబాబు మాటమాత్రమైన వాటిని ప్రస్తావించకపోవడం అన్ని వర్గాల వారిని నిరుత్సాహానికి గురిచేసింది. 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు శుక్రవారం సంతనూతలపాడు నియోజకవర్గం నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాలపాడు గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రబాబు ప్రసంగించారు. తన ప్రసంగంలో గుండ్లకమ్మ మినహా మిగతా అంశాలను ప్రస్తావించలేదు. వంద రోజుల పాలనలో ఏమి చేశారో చెప్పకుండా, రాబోయే రోజుల్లో ఏమి చేస్తారో ప్రకటించకుండా.. కేవలం ప్రతిపక్ష వైఎస్సార్ సీపీపై దుమ్మెత్తిపోయడానికే ఆయన ఎక్కువ సమయం కేటాయించారు.

గంటన్నర ఆలస్యంగా..

ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సీఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు రావాల్సి ఉంది. అయితే జనాలు రాకపోవడంతో చంద్రబాబు గంటన్నర ఆలస్యంగా సభా స్థలికి వచ్చారు. మధ్యాహ్నం 3.30 గంటలకు చదవాలడ సమీపంలో ఓ ప్రైవేట్ విల్లా ఆవరణలో ఉన్న హెలిప్యాడ్ వద్ద దిగారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన మద్దిరాలపాడు గ్రామానికి చేరుకున్నారు. ముందుగా ఆయన గత ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిన లబ్ధిదారుడు పఠాన్ నూర్జహాన్ ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి టీడీపీ సానుభూతిపరుడు ఆళ్లదాసు శ్రీను ఇంటికి వెళ్లారు. తర్వాత ప్రభుత్వం కేటాయించబోయే మద్యం దుకాణాన్ని కల్లుగీత కార్మికుని కోటాలో ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ సానుభూతిపరుడు జగ్గయ్య ఇంటికి వెళ్లి మాట్లాడారు. టీడీపీ సామాజికవర్గం ఎక్కువగా నివాసముంటున్న ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో చిన్నపాటి వేదిక ఏర్పాటు చేశారు. రెండు వందల మంది పట్టే స్థలంలో చంద్రబాబు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సీ కాలనీ వాసులను దూరంగా ఉంచడం గమనార్హం.

గంట ప్రసంగం.. ప్రతిపక్షంపై విమర్శల దండకం

బహిరంగ సభలో సీఎం చంద్రబాబు తనకు అలవాటైన రీతిలో సుదీర్ఘంగా గంటపాటు ప్రసంగించారు. అందులో ఎక్కువ సమయం గత ప్రభుత్వం, ప్రతిపక్ష పార్టీపై విమర్శలకే కేటాయించారు. మద్దిరాలపాడు గ్రామ సభలో వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి చెబుతారని అందరూ భావించారు. 'అధికారంలోకి వచ్చిన తర్వాత 7 శ్వేత పత్రాలు విడుదల చేశాం. పింఛన్లు ఇచ్చాం' అనే విషయాలు తప్ప మరో పథకం గురించి ప్రస్తావనే లేకపోవడం గమనార్హం. బాబాయ్ హత్య, కల్తీ నెయ్యి అంటూ విమర్శలకే పరిమితమైన చంద్రబాబు.. 100 రోజుల్లో చేసిందేమిటో చెప్పకపోవడంపై చర్చ సాగుతోంది. రానున్న రోజుల్లో ప్రభుత్వం ఏమి చేస్తుందో ప్రస్తావించకపోవడంపై జిల్లా వాసులు పెదవి విరుస్తున్నారు. భవిష్యత్‌లో ఫలానా పని చేస్తామని స్పష్టంగా చెప్పుకోలేని దుస్థితిలో పాలకులు ఉంటే 'ఇది మంచి ప్రభుత్వం' ఎలా అవుతుందన్న ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమైంది.

ఎంపిక చేసిన లబ్ధిదారులతో పొగడ్తలు

చంద్రబాబు ప్రసంగించక ముందు అధికారులు ముందుగా ఎంపిక చేసిన లబ్ధిదారులతో మాట్లాడించారు. వారు ప్రభుత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తారు. సింగరాయకొండలో ప్రైవేట్ కళాశాల నిర్వహిస్తున్న డాక్టర్ గీతారాణి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రసంగించారు. ఈ చట్టం దార్వా ప్రజలకు అన్యాయం జరిగిందని ఆరోపణలు గుప్పిస్తూ ఆసాంతం తడబడ్డారు. ఆ తర్వాత గ్రామ సర్పంచ్ స్వర్ణ అనూరాధ, మరో మహిళ మండవ వెంకటేశ్వరమ్మ ప్రసంగించారు. అనూరాధ ప్రస్తావించిన సమస్యలు పరిష్కరిస్తానని చెప్పిన చంద్రబాబు నిధుల కేటాయింపు అంశాన్ని దాటవేశారు.

గ్రానైట్ పరిశ్రమలకు నిరాశ

సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత మొదటిసారి సంతనూతలపాడు నియోజకవర్గంలో అడుగు పెడుతుండటంతో గ్రానైట్ వ్యాపారుల్లో ఆశలు చిగురించాయి. రాయల్టీ సుంకాలు, విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తారని, తమపై వరాల జల్లు కురిపిస్తారని భావించిన వ్యాపారులను చంద్రబాబు ప్రసంగం తీవ్ర నిరుత్సాహానికి గురిచేసింది. ఇటీవల సార్వత్రిక ఎన్నికలకు ముందు గ్రానైట్ పరిశ్రమను ఆదుకుంటామని చంద్రబాబు, లోకేష్ ఇచ్చిన హామీల జోలికి చంద్రబాబు వెళ్లకపోవడంతో పారిశ్రామికవేత్తలు డీలా పడ్డారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి, బూదవాడ, మర్రిచెట్లపాలెంతో పాటు గుండ్లాపల్లి, ఒంగోలు శివారు ప్రాంతాలు, బల్లికురవ పరిసరాల్లో సుమారు 2500 గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. రాయల్టీ భారం తగ్గించి విదేశాలకు ఎగుమతులు నిలిచిపోకుండా పరిశ్రమలను ఆదుకుంటామని ఎన్నికల వేళ ఇచ్చిన హామీ ప్రకారం రాయితీలు ప్రకటిస్తారని వ్యాపారులు ఎదురు చూశారు. వాటితోపాటు జిల్లాలోని 800 యూనిట్లకు సుమారు రూ.250 కోట్ల వరకు ప్రోత్సాహకాలు రావాల్సి ఉందని అంచనా. వీటిని ఎప్పుడు అందిస్తారో చెప్పకుండానే చంద్రబాబు ప్రసంగం సాగింది.స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పరిధిలో రెండు చెక్‌డ్యామ్‌లు కావాలని, రోడ్లు, కాలువలకు నిధులను కేటాయించాలని తన ప్రారంభ ఉపన్యాసంలో సీఎం దృష్టికి తీసుకొచ్చారు. అయినా సీఎం చంద్రబాబు నిధులు కేటాయిస్తామని చెప్పకపోవడం స్థానిక ప్రజలను ఆలోచనలో పడేసింది. ఇదిలా ఉండగా మద్దిరాల పాడు అంతా జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులతో నిండిపోయింది.

జిల్లా బాధ్యతలు చెవిరెడ్డి, బూచేపల్లికి



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బూచేపల్లి వెంకాయమ్మ, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, ఆదిమూలపు సురేష్, తాటిపర్తి చంద్రశేఖర్, అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, దద్దాల నారాయణ

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా శివప్రసాద్‌రెడ్డి
- ఒంగోలు పార్లమెంట్ పరిశీలకునిగా భాస్కరరెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ జిల్లా బాధ్యతలను చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలకు అప్పగిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా శివప్రసాద్‌రెడ్డిని, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకునిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను నియమించినట్లు ఆయన ప్రకటించారు. శుక్రవారం తాడేపల్లిలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. జిల్లా బాధ్యతలు అప్పగించే విషయంపై ఆయన వారితో సమీక్షించారు. అనంతరం బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని జిల్లా అధ్యక్షునిగా ప్రకటించారు. మరో వైపు మాజీ విప్, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకునిగా ప్రకటించారు. ఈ సమావేశంలో మాజీమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, దర్శి ఎమ్మెల్యే, తాజా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, గిద్దలూరు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జున రెడ్డి, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ తోపాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పార్టీ ప్రక్షాళన జరుగుతుందని, బూచేపల్లి నాయకత్వంలో రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బూచేపల్లి అందరినీ కలుపుకుపోయే నైజం కలవాడని, గ్రూపులను ప్రోత్సహించడని, ముఠాలు కట్టే ప్రసక్తే ఉండదని సురేష్ పేర్కొన్నారు.

గాలివాన బీభత్సం



రమణారెడ్డిపాలెంలో ఇంటిపై విరిగిపడిన వేపచెట్టు



రోడ్డుపై విరిగిపడిన చెట్టు

- ఈదురు గాలులకు ఇళ్లపై విరిగి పడిన చెట్లు

ముండ్లమూరు (దర్శి): మండలంలో శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలలకు పలు గ్రామల్లో చెట్లు విరిగి ఇళ్లపై పడటంతో పాటు వేములబండ – రమణారెడ్డి పాలెం గ్రామాల మధ్య చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. దీంతో ఆ మార్గంలో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రమణారెడ్డి పాలెంలో జన మాల ఆంథోని ఇంటిపై చెట్టు విరిగి పడడంతో రేకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. యన్నం చెన్నయ్య, రాయపూడి హనుమంతరావు ఇంటి ముందు భాగంలో ఏర్పాటు చేసుకున్న ఇంటి రేకులు గాలికి పూర్తిగా ధ్వంసం అయ్యాయి. రమణారెడ్డిపాలెం – వేముల బండ గ్రామాల మధ్యలో గాలులకు చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో ఆ మార్గంలో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాత్రి వేళ కావడంతో ఆ మార్గంలో వాహన దారులు నానా అవస్థలు పడి పంట చేల నుంచి వాహనాలను దారి మళ్లించుకొని అతి కష్టంపై బయటపడ్డారు. ఈదురు గాలలకు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అంధకారంలో గడిపారు.

రెండు దశాబ్దాలుగా ప్రజాసేవలో..

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి అవకాశం
- హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కేడర్, ప్రజాప్రతినిధులు, అభిమానులు




తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశంలో జిల్లా నాయకులు

దర్శి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగుతూ ప్రజల్లో తనదైన ముద్రవేసుకున్న శివప్రసాద్‌రెడ్డికి పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కేటాయించడంపై జిల్లా అంతటా హర్షం వ్యక్తమవుతోంది. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి 2004 ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి నుంచే శివప్రసాద్ రెడ్డి కూడా ప్రజాసేవలో నిమగ్నమయ్యారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సూచనల మేరకు 2009 ఎన్నికల్లో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతూ వచ్చారు. సంవత్సరం ముందుగానే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి జగనన్న వెంట నడిచారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి పాలైనా దర్శి నియోజకవర్గంతో పాటు, సంతనూతలపాడు నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటూ వచ్చారు. ఆ తరువాత తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి అనారోగ్య కారణాలతో 2019 ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. అయితే దర్శి నియోజకవర్గంలో పార్టీ నిలబెట్టిన మద్దిశెట్టి వేణుగోపాల్‌ను, సంతనూతలపాడు నియోజకవర్గంలో టీజేఆర్ సుధాకర్ బాబును అత్యధిక మెజార్టీతో గెలిపించారు. దర్శి జెడ్పీటీసీగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తల్లి బూచేపల్లి వెంకాయమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బూచేపల్లి కుటుంబం పార్టీకి చేసిన సేవలు గుర్తించిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. బూచేపల్లి వెంకాయమ్మను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ని చేశారు. ఆ తరువాత రెండు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, బూచేపల్లి అభిమానులకు అండగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేసి 2500 ఓట్ల మెజార్టీతో గొట్టిపాటి లక్ష్మిపై గెలుపొందారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత ప్రభుత్వం అధికారంలో లేకపోయినా ప్రజలకు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు జరిగిన ఇబ్బందులను అధిగమిస్తూ తానున్నానని అండగా ఉన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ దాడులు, ఎస్సై, సీఐల వేధింపులపై బూచేపల్లి ఘాటుగా స్పందించారు. ఏకంగా సీఐ, ఎస్సైల తీరు పై పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు పిలుపునిచ్చారు.

సాయం చేసే గుణం బూచేపల్లిది

బూచేపల్లి కుటుంబం అంటే అందరికీ సాయం చేసే గుణం అని జిల్లాలో మంచి పేరుంది. అన్నదాన కార్యక్రమాలు, ఆలయాలకు విరాళాలు, బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా హెల్త్ క్యాంపులు నిర్వహించడం, పేదలకు అనేక సహాయ సహకారాలు అందించడం, ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా, గ్రామాల్లో వాటర్ ప్లాంట్ల నిర్వహణ, తమ సొంత నిధులతో బోర్లు వేయించడం వంటి కార్యక్రమాలతో మంచిపేరు తెచ్చుకున్నారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని జిల్లా అధ్యక్షునిగా నియమించడం పై దర్శి, సంతనూతలపాడు నియోజకవర్గాలతో పాటు జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా అక్కినేని శతజయంతి వేడుకలు



అక్కినేని నాగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కళా పరిషత్ సభ్యులు



అక్కినేని సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

- అలరించిన సినీ సంగీత విభావరి

ఒంగోలు మెట్రో: అజరామరమైన పాత్రలకు జీవం పోయటం ద్వారా నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని సూర్యశ్రీ ట్రస్టు వ్యవస్థాపకుడు మండవ మురళీకృష్ణ అన్నారు. ఏఎన్ఆర్ శతజయంతి సందర్భంగా అక్కినేని కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉదయం కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న అక్కినేని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి విగ్రహాన్ని అక్కినేని కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అధ్యక్షుడు కళ్లగుంట కృష్ణయ్యను ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అభినందించారు. సాయంత్రం సీవీఎస్ రీడింగ్ రూం ఆవరణలో అక్కినేని సినీ గీతాలతో నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయనీ గాయకులు బాలరాజు, హేమమాలిని, విజయ్, పూర్ణిమ, సంస్థ అధ్యక్షుడు కల్లగుంట కృష్ణ పాటలు పాడారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన ఘంటసాల శతజయంతి అన్న సంతర్పణ కార్యక్రమాన్ని మండవ మురళీకృష్ణ ప్రారంభించారు. అనంతరం అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కల్లగుంట కృష్ణయ్య అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బోడపాటి సాయి నవీన్, ఆలూరు రామారావు, బేతంశెట్టి హరిబాబు, తొట్టెంపూడి కృపారావు, మండవ సుబ్బారావు, ఓరుగంటి ప్రసాద్, సీహెచ్.లక్ష్మీనారాయణ, పొన్నలూరు జానకీరామ్, గుర్రం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు టౌన్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని 2024వ సంవత్సరానికిగానూ టూరిజం అవార్డులు ప్రదానం చేసేందుకు జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ట్రావెల్ ఏజెంట్లు, బెస్ట్ బస్టాండ్లు, బెస్ట్ రైల్వే స్టేషన్ల నుంచి దరఖాస్తులను ఏపీ టూరిజం శాఖ ఆహ్వానిస్తోంది. అవార్డుల కోసం ఈ నెల 22వ తేదీలోపు విజయవాడలోని ఏపీ టూరిజం అథారిటీకి దరఖాస్తులు అందజేయాలని తెలిపింది. పూర్తి వివరాల కోసం ఏపీ టూరిజం వెబ్‌సైట్‌ను సందర్శించాలని, మరిన్ని వివరాలకు 9121144102కు ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.



- ఎమ్మెల్యే దామచర్ల మెప్పు కోసం మేయర్ అత్యుత్సాహం
- దామచర్ల ఇంటికి ఎదురుగా రోడ్డుపై అలంకరణ
- రూ.లక్షల్లో ప్రజాధనం దుబారా
- నగరంలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు వదిలేసి మరీ హడావిడిగా...

పురివిప్పిన దుబారా..!

ఒంగోలు సబర్బన్: ఎమ్మెల్యే దామచర్ల ప్రాపకం కోసం ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ సుజాత పడుతున్న తాపత్రయం అంతా...ఇంతా కాదు. ఎమ్మెల్యే ఇంటికి వెళ్లేదారిలో రూ.లక్షలు ఖర్చుచేసి మరీ డివైడర్‌ను సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ముందు నెమలి బొమ్మను ఏర్పాటు చేస్తున్నారు. ఇంత హడావుడి ఎందుకా అని ఆరా తీస్తే.. అసలు విషయం వెలుగుచూసింది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బీకే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. అపార్ట్‌మెంట్‌లో నుంచి కారులో బయటకు వెళ్లేటప్పుడు...బయట నుంచి లోనికి వెళ్లేటప్పుడు ఎమ్మెల్యే దామచర్లకు ఆహ్లాదకరంగా ఉండేలా దీనిని ఏర్పాటు చేస్తున్నారని తెలిసి అందరూ అవాక్కవుతున్నారు. గురువారం మధ్యాహ్నం నుంచి కార్పొరేషన్ అధికారులు రిమ్స్ ఆస్పత్రి దగ్గర నుంచి బీకే ఎన్ క్లేవ్ వరకూ డివైడర్ వద్ద జోరుగా పనులు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి డివైడర్ ముందు భాగంలో నెమలి బొమ్మ ప్రత్యక్షమైంది. రూ.లక్షల్లో వెచ్చించి మరీ కేవలం 25 అడుగుల్లో మాత్రమే పనులు చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి మరీ మేయర్ దీనిని ఏర్పాటు చేస్తున్నారని కార్పొరేషన్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు కూడా చేసేది లేక జీ హుజూర్ అంటూ తలలు ఆడిస్తున్నారు. ఒంగోలు నగరంలో అత్యవసరంగా చేపట్టాల్సిన రోడ్డు పనులు, డ్రైనేజీ పనులు ఎన్నో ఉంటే అవన్నీ గాలికి వదిలేసి ఎమ్మెల్యే ఇంటి ముందు మాత్రం డివైడర్‌ను సుందరంగా తీర్చిదిద్దుతున్నారంటే ప్రజాధనాన్ని ఏవిధంగా దుర్వినియోగం చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. వైఎస్సార్‌సీపీ తరపున గెలిచి మేయర్ పదవిని అలంకరించిన సుజాత ఇటీవల తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటి నుంచి ఎమ్మెల్యే దామచర్ల మెప్పు కోసం ఆమె ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. పలువురు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను టీడీపీలోకి రావాలని ఒత్తిడి చేసినట్టు కూడా ప్రచారంలో ఉంది.



బీకే అపార్ట్‌మెంట్ ఎదురుగా రోడ్డు డివైడర్‌పై నెమలి బొమ్మతో పాటు సుందరంగా తయారు చేస్తున్న నగర పాలక సంస్థ అధికారులు

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన జిల్లా రిజిస్ట్రార్

- ఒంగోలు హెడ్‌క్వార్టర్ సబ్ రిజిస్ట్రార్లతో సమీక్ష



బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఎదురుగా ఒంగోలు హెడ్‌క్వార్టర్ సబ్ రిజిస్ట్రార్లు

ఒంగోలు సబర్బన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా ఆళ్ల బాలాంజనేయులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక పాత గుంటూరు రోడ్డులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని రిజిస్టర్‌లో సంతకం చేసి విధుల్లో చేరారు. అనంతరం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగం డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలు హెడ్‌క్వార్టర్ సబ్ రిజిస్ట్రార్లు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఒంగోలు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ చేతల శ్రీనివాసరావు, ఒంగోలు జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ అప్పిరెడ్డి వాసుదేవరెడ్డి, ఆడిట్ సబ్ రిజిస్ట్రార్ సుల్తాన్‌బాషా, చిట్స్ సబ్ రిజిస్ట్రార్ పద్మావతితో జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు సమీక్ష నిర్వహించారు. ఒంగోలు కార్యాలయం పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాలతో పాటు ఇతర అన్ని రకాల అంశాలపై సమాచారం రాబట్టారు. అదేవిధంగా ఆడిట్ విభాగంలో, చిట్స్ విభాగంలోని పలు అంశాలపై సబ్ రిజిస్ట్రార్లతో చర్చించారు.

ఎస్సీ రిజర్వేషన్లకు చంద్రబాబు నిప్పు

- దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

ఒంగోలు టౌన్: ఎస్సీ రిజర్వేషన్లకు సీఎం చంద్రబాబునాయుడు వర్గీకరణ నిప్పు పెట్టారని, ఇప్పుడది ఎస్టీ రిజర్వేషన్లకు కూడా అంటుకుందని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు విమర్శించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 22వ తేదీ స్థానిక అంబేడ్కర్ భవనంలో నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ స్థానిక సమితి కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మనువాదులు చేస్తున్న కుట్రలను, బీజేపీ కుతంత్రాన్ని దళితులు అర్థం చేసుకోవాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలు రాజ్యాధికారం వైపు కన్నెత్తి చూడకుండా చేసే కుట్రతోనే మోదీ ప్రభుత్వం వర్గీకరణను ముందుకు తీసుకొచ్చిందన్నారు. రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేసేందుకు 400 మంది ఎంపీలను గెలిపించాలని మోదీ ఇచ్చిన పిలుపును దళిత బహుజనులు తిరస్కరించారని, ఇప్పుడు అరకొర మెజారిటీతో ఇతర పార్టీల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన దుస్థితిలో పడ్డారని చెప్పారు. అందుకే దేశంలో ఉన్న 27 శాతం ఎస్సీ, ఎస్టీల ఐక్యతను దెబ్బతీయాలని పన్నాగాలు పన్నుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలన్నీ మాలలకే వస్తున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని, ఉద్యోగాలన్నీ మాలలకే వచ్చి ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో 27 వేల ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులు ఎందుకు ఖాళీగా ఉన్నాయని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, దళిత నాయకుడు కాకుమాను రవి పాల్గొన్నారు.

కోలాహలం.. యువజనోత్సవం









జిల్లా యువజన సంక్షేమశాఖ (స్టెప్) ఆధ్వర్యంలో స్థానిక క్విస్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు కోలాహలంగా సాగాయి. వివిధ పోటీల్లో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ, జానపద గీతాలకు నృత్యాలతో ఆకట్టుకున్నారు. జానపద నృత్యాలు (గ్రూప్, సోలో), జానపద గేయాలు (గ్రూప్, సోలో), స్టోరీ రైటింగ్, పెయింటింగ్, వైజ్ఞానిక ప్రదర్శన, పొయిట్రీ విభాగాలలో పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు సత్తాచాటారు. ప్రథమస్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ తెలిపారు. ముఖ్య అతిథిగా క్విస్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు తోడ్పడతాయని అన్నారు. కేంద్రీయ విద్యాలయ అధ్యాపకులు, క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ ఆచార్యులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. జిల్లాలోని వివిధ కాలేజీలు, సంగీత విద్యాలయాల విద్యార్థులు సుమారు 400 మంది పాల్గొని సందడి చేశారు. జిల్లా యువజన అధికారి కమల్‌సా, జీబీఆర్ ప్రసాద్, తదితరులు పర్యవేక్షించారు.

– ఒంగోలు









నృత్యం చేస్తున్న విద్యార్థులు



పేపర్లతో తయారు చేసిన బొమ్మల ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో పాల్గొన్న ఇంజినీరింగ్ విద్యార్థులు



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వణికిస్తున్న జ్వరాలు

- మార్కాపురం జీజీహెచ్‌కి క్యూ కడుతున్న బాధితులు
- పట్టించుకోని అధికారులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు మార్కాపురం జీజీహెచ్‌తో పాటు ప్రైవేటు హాస్పిటల్స్‌కు క్యూ కడుతున్నారు. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. పదిరోజుల క్రితం కురిసిన వర్షాలకు వాతావరణం మారడంతో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. తలనొప్పి, జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. మార్కాపురం జీజీహెచ్‌లో రోజుకు 500 నుంచి 600 వరకూ ఓపీ ఉంటుండగా, అందులో సుమారు 150 నుంచి 200 వరకూ జ్వరబాధితులే ఉంటున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. కాలువల్లో పూడిక తీసి రోడ్డుపైనే ఉంచడంతో దోమలు వ్యాపిస్తున్నాయి. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌తో పాటు పట్టణంలో ఉన్న సుమారు 20కిపైగా ప్రైవేటు వైద్యశాలల్లో వైరల్ జ్వరాలతో బాధపడుతున్నవారు చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని పీఎస్ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, జవహర్‌నగర్ కాలనీ, ఎస్టేట్, డ్రైవర్స్ కాలనీ, మండలంలోని వేములకోట, నాగులవరం, దరిమడుగు, గజ్జలకొండ తదితర గ్రామాల్లో కూడా పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. చిన్నారులు సైతం జ్వరాలతో సతమతమవుతున్నప్పటికీ వైద్యశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. జ్వరాలను అదుపు చేసేందుకు ఎక్కడికక్కడ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉన్నప్పటికీ.. కనీస చర్యలు కూడా చేపట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మొక్కుబడిగా పనిచేస్తూ.. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, రోడ్డు వెంబడి తినుబండారాలు వద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటుకు దూరంగా ఉండాలని ఉచిత సలహాలకే పరిమితమయ్యారు.



మార్కాపురం జీజీహెచ్‌లో ఓపీ కోసం క్యూ కట్టిన జ్వరపీడితులు

అనంతవరంలోనూ విజృంభిస్తున్న జ్వరాలు...

టంగుటూరు: మండలంలోని అనంతవరం గ్రామంలోనూ ప్రజలను జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. పారిశుధ్య లోపం కారణంగా ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉండటంతో దోమలు విజృంభించి విషజ్వరాలు ప్రబలుతున్నాయి. స్థానిక ఎస్సీకాలనీలో విషజ్వరాలతో ప్రజలు మంచంపట్టారు. 104 సిబ్బంది వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ.. ఆ దాఖలాలు కనిపించడం లేదు. గ్రామంలోని వాటర్ ప్లాంట్‌ను శుభ్రపరచకపోవడం కూడా జ్వరాలకు మరో కారణమని ప్రజలు భావిస్తున్నారు. వైద్యాధికారులు వెంటనే స్పందించి వైద్య శిబిరాలు నిర్వహించాలని, పారిశుధ్యాన్ని మెరుగుపరిచి వాటర్ ప్లాంట్‌ను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చిన్నారులకు చికిత్స కోసం డాక్టర్ వద్ద ఉన్న తల్లులు

రేపు ఒంగోలులో మాలల మహాసభ

ఒంగోలు: స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 22వ తేదీ మాలల మహాసభ నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షుడు దండేల కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించి రద్దు చేయాలని కోరుతూ ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సుప్రీం తీర్పు మనువాదుల తీర్పు అని, రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఆ తీర్పును పునఃపరిశీలించి రద్దుచేయాలని కోరుతూ హలో మాల.. చలో ఒంగోలు పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు, జైభీమ్ పీపుల్స్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు కొండలరావు, మాలమహాసభ రాష్ట్ర కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలు









పిచ్చి కుక్క దాడిలో గాయపడిన వృద్ధురాలు గంగమ్మ, జానయ్య, అంకయ్య, శ్రీనివాసులు

బేస్తవారిపేట: పిచ్చి కుక్క దాడి చేసి ఎనిమిది మందిని గాయపరిచిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని సలకలవీడులో గురువారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన అన్నసముద్రం శ్రీనివాసులు, ఎన్.గంగమ్మ, శ్రీనివాసులు, కే జానయ్య, ఎన్.అంకయ్య, వై.వసుంధర ఆరుబయట పడుకుని నిద్రిస్తుండగా పిచ్చి కుక్క దాడి చేసింది. దీంతో అర్ధరాత్రివేళ కంభం పీహెచ్‌సీకి వెళ్లి వారంతా వైద్యం చేయించుకున్నారు. వారి కాళ్లు,చేతులకుతీవ్రగాయాలయ్యాయి.గురువారం మధ్యాహ్న సమయంలో ఆర్.కొత్తపల్లెకు చెందిన మరో ఇద్దరు కూలీలపైకూడాగ్రామంలో బోరు వేసే సమయంలో పిచ్చి కుక్క దాడి చేసి గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, అరికట్టాలని గ్రామస్తులుకోరుతున్నారు.

పొగాకు కేజీ గరిష్ట ధర రూ.358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలోని వేలం కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు గరిష్ట ధర రూ.358 పలికింది. ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాలకుగానూ 8 కేంద్రాల్లో వేలం జరిగింది. ఆయా కేంద్రాల్లో వేలానికి మొత్తం 11,237 బేళ్లు రాగా, 9,074 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 2,163 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలులోని రెండు కేంద్రాలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో శుక్రవారం 154వ రోజు నిర్వహించిన వేలానికి 5,078 బేళ్లు రాగా, 4,118 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 960 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.48, సరాసరి ధర రూ.209.81 పలికింది. కందుకూరు-1, 2, పొదిలి, తదితర వేలం కేంద్రాల్లో 160వ రోజు నిర్వహించిన వేలానికి 6,159 బేళ్లు రాగా, 4,956 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,203 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.150, సరాసరి ధర రూ.293.67 పలికింది.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

- మూడు నెలల నుంచి నిలిచిన రేషన్ బియ్యం సరఫరా
- నాటి ప్రభుత్వంలో వాహనాల ద్వారా నేరుగా ఇళ్లకు..
- నేడు పరిస్థితి ఘోరం

హనుమంతునిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల పరిస్థితి ఘోరంగా మారింది. కనీసం రేషన్ బియ్యం కూడా సక్రమంగా సరఫరా చేయలేని దుస్థితి నెలకొంది.దీంతో పేదలు ప్రభుత్వ కార్యాలయాలనే ముట్టడించాల్సి వస్తోంది. దాసరపల్లి పంచాయతీ గ్రామ సచివాలయ పరిధిలోని రెడ్డెం వారిపల్లి గ్రామస్తులకు మూడు నెలల నుంచి రేషన్ బియ్యం ఇవ్వకపోవడంతో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. రెడ్డెంవారిపల్లి గ్రామం దాసరిపల్లి గ్రామ పంచాయతీలో ఉంటుంది. ఆ గ్రామంలో 60 మంది రేషన్ కార్డు దారులున్నారు. ఆ పంచాయతీ డీలర్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జుటికే సునీల్ అనే వ్యక్తి వాహనం ద్వారా ఇళ్లకు వెళ్లి రేషన్ బియ్యం సరఫరా చేసేవాడు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు నెలల నుంచి వాహనం గ్రామానికి వెళ్లడంలేదు. అతని ఆరోగ్యం సరిగా లేదంటూ వాహనం నిలిపి వేశారు. ఇలా మూడు నెలల నుంచి బియ్యం పేదల వద్దకు చేరలేదు. గ్రామానికి దాసరిపల్లి డీలర్ షాపు రెండు మయిళ్ల దూరంలో ఉంటుంది. నడిచి వెళ్లలేని వృద్ధులకు బియ్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది కొండారెడ్డిపల్లి, దాసరిపల్లి గ్రామంలోని డీలర్ షాపునకు వెళ్లి ఒక నెలకు తెచ్చుకునట్లు తెలిపారు. మరలా వెళ్లిన వారికి బియ్యం ఇవ్వడంలేదు. ఎప్పుడు స్టాక్ ఉంటుందో.. ఎప్పుడు ఉండదో ఎవరికీ అర్థం కాని అయోమయ పరిస్థితి నెలకొంది. రేషన్ షాపు గతంలో తిమ్మారెడ్డిపల్లి పంచాయతీలో ఉండేదని.. గత కొన్నేల నుంచి దాసరిపల్లి పంచాయతీకి మార్చినప్పటి నుంచి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. షాపును తిమ్మారెడ్డిపల్లికి మార్చాలని కోరారు. దీంతో తహసీల్దార్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ హనుమంతునిపాడు, కొండారెడ్డిపల్లి షాపుల నుంచి బియ్యం గ్రామానికి పంపించినట్లు తెలిపారు. దాసరిపల్లికి కొత్త డీలర్‌ను ఏర్పాటు చేశాయాలని కలెక్టర్‌ను కోరామన్నారు. గ్రామస్తులు ఎం.సుబ్బమ్మ, ఎం. రామలక్ష్మ, కొప్పుల రాజు, అరునమ్మ, రత్తమ్మ, లింగయ్య, కె. వెంకటరెడ్డి, ఎన్.శంకర్, శ్రీను, ఎన్.తిరుపాలు, ఎస్.అనంతయ్యతో పాటు 50 మంది గ్రామస్తులు ఆందోళనలో పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన రెడ్డెంవారి పల్లి గ్రామస్తులు